## క్లుప్తంగా

### రేపు గడప గడపకు మన ప్రభుత్వం

సత్యవేడు: మండలంలోని దాసుకుప్పం సచివాలయం పరిధిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆయా గ్రామాల్లో పర్యటిస్తారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, సచివాలయం సిబ్బంది హాజరుకావాలన్నారు.

### పాఠశాలల తనిఖీ

పిచ్చాటూరు: మండలంలోని పాఠశాలలను పుత్తూరు డీవైఈఓ రఘురామయ్య శనివారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అక్కడి నుండి స్థానిక ఎమ్మార్సీకి వెళ్లి సేఫ్టీ మెజర్స్‌పై సీఆర్‌పీలకు సూచనలు చేశారు. జగనన్న విద్యాకానుక పంపిణీ, ఎన్‌రోల్‌మెంట్, డ్రాపౌట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంఈఓలు హేమమాలిని, యుగంధర్ రాజు, హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు ఉన్నారు.

### విధుల్లో నిర్లక్ష్యం వద్దు

ఏర్పేడు: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని డాక్టర్ శిల్ప సిబ్బందికి సూచించారు. పాపానాయుడుపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణిగా శనివారం బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లా జిల్లెలమంద పీహెచ్‌సీ నుంచి పాపానాయుడుపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి బదిలీపై వచ్చారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగరాజు సమక్షంలో డాక్టర్ శిల్ప బాధ్యతలు చేపట్టారు.

### ఏర్పేడు విద్యుత్ ఏఈగా వంశీకృష్ణారెడ్డి

ఏర్పేడు: మండలంలోని పాపానాయుపేట సెక్షన్ ఎస్పీడీసీఎల్ ఏఈగా వంశీకృష్ణారెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న మునికుమార్ సాధారణ బదిలీల్లో భాగంగా కేవీబీపురానికి వెళ్లారు. నెల్లూరు జిల్లా కృష్ణపట్నం జెన్‌కోలో ఏఈగా విధులు నిర్వహిస్తున్న వంశీకృష్ణారెడ్డి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

### వెండి రాహుకేతు సర్పాల వితరణ



వెండి రాహుకేతువులను అందజేస్తున్న ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి తెలంగాణ రాష్ట్రం సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య. కుటుంబసభ్యులు శనివారం రూ.1.50 లక్షలు విలువ చేసే వెండి రాహుకేతు సర్పాలను కానుకగా అందజేశారు. వీటిని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి, అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### పరాశరేశ్వరుడి సేవలో ఎమ్మెల్యే పెద్దారెడ్డి



ఎమ్మెల్యేకి స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న నరసింహ యాదవ్

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం పరాశ రేశ్వర స్వామి ఆలయంలో అనంతపురం జిల్లా తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి శనివారం పూజలు చేశారు. ఆలయ చైర్మన్ నరసింహ యాదవ్ ఎమ్మెల్యే పెద్దారెడ్డికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువలతో సన్మానించి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ విశిష్టతను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రోశయ్య, రాజశేఖర్, తహసీల్దారు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా డాక్టర్స్ డే



వైద్యులను సన్మానిస్తున్న రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

రేణిగుంట: మండలకేంద్రంలోని రైల్వే హాస్పిటల్‌లో శనివారం డాక్టర్స్ డేను పురస్కరించుకుని ఆస్పత్రి వైద్యులను రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ బ్రాంచ్ సెక్రటరీ జయంతీకుమార్, చైర్మన్ వెంకటముని, వర్కింగ్ చైర్మన్ రామ్మూర్తి, జాయింట్ సెక్రటరీ రఘునాథరెడ్డి, జ్ఞానశేఖర్, రవీంద్రబాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**బుచ్చినాయుడుకండ్రిగలో..**

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో శనివారం డాక్టర్స్ డే నిర్వహించారు. వైద్యాధికారులు మాధవి, దివాకర్ కేక్ కట్ చేశారు.

**వైద్యుల సేవలు వెలకట్టలేనివి**

వరదయ్యపాళెం: వైద్యుల సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులు ఉదయ్‌కుమార్, ద్వైతను సత్కరించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమానికే జగనన్న సురక్ష

- రూపాయి ఖర్చు లేకుండా ధ్రువీకరణ పత్రాలు అందజేత
- సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే పాలన
- జిల్లా కలెక్టర్ వెంకటరమణా రెడ్డి





ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం, లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి, బియ్యపు పవిత్రారెడ్డి

ఏర్పేడు: జగనన్న సురక్షతో ప్రజలకు అన్నివిధాలా లబ్ధి చేకూరుతున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పల్లం సచివాలయంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డితో కలిసి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా సచివాలయం పరిధిలో సిబ్బంది పనితీరు, అందుతున్న సేవలను గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను అమలు చేసి వలంటీర్ల ద్వారా ఇంటింటికి సేవలు అందిస్తున్నట్లు వివరించారు. ఈ ప్రభుత్వంలో కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రజలకు నిజమైన పాలన, సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. పల్లం సచివాలయ పరిధిలో 610 వివిధ రకాల సర్టిఫికెట్లు, 632 సమస్యలను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. నెల రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. 11 రకాల సర్టిఫికెట్లు సచివాలయ పరిధిలో ఉచితంగా అందజేస్తారన్నారు. బియ్యపు పవిత్రారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రారంభించి గ్రామస్వరాజ్యాన్ని స్థాపించారన్నారు. ప్రజా సమస్యలు సంతృప్తస్థాయిలో పరిష్కారమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని వారికి కావాల్సిన సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు చెప్పారు. అనంతరం సచివాలయ పరిధిలోని ప్రజలకు రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు.



సమావేశానికి హాజరైన గ్రామస్తులు



ఏఎంపురంలో ధ్రువీకరణ పత్రాలతో లబ్ధిదారులు

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, జెడ్పీటీసీ తిరుమలయ్య, ఎంపీపీ గీత, వైస్ ఎంపీపీలు జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసులు, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శివయ్య, శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు భక్తవత్సల నాయుడు, సర్పంచ్‌లు గోపాల్, బాలప్రసాద్, సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్దన్, మాజీ ఎంపీటీసీ రమణయ్య యాదవ్, ఎంపీడీఓ గిడ్డయ్య, తహసీల్దారు శివప్రసాద్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

**శ్రీకాళహస్తిలో..**

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలంలోని కాపుగున్నేరి సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా 517 మంది దరఖాస్తుదారులకు 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఎలాంటి రుసుం లేకుండా ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి దరఖాస్తుదారులు భారీస్థాయిలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ చేమూరు స్వప్న అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో చెర్లోపల్లి సర్పంచ్, వార్డుమెంబర్లు, వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది, ఎంపీడీఓ పఠాన్ రఫీఖాన్, తహసీల్దారు రూప్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

**జగనన్న సురక్ష.. పేదవాడికి రక్ష**

నారాయణవనం: జగనన్న సురక్షతో పేదలకు అన్ని రకాల సేవలు లభిస్తాయని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. శనివారం సొంత గ్రామమైన భీమునిచెరువు సచివాలయంలో జగనన్న సురక్ష క్యాంపును ఆయన ప్రారంభించారు. 366 మందికి సురక్ష క్యాంపులో సమస్యలు పరిష్కారమయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మధ్యవర్తులు, దళారీలు లేకుండా నేరుగా లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలోకి సంక్షేమ నగదును జమ చేస్తున్న ఘనత మన ప్రభుత్వానిదేనని అన్నారు. అర్హులందరికీ పథకాలను అందించాలన్న లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సచివాలయ కార్యదర్శులు అర్హులను గుర్తించి సంక్షేమ పథకాలు అందించాలని సూచించారు. అప్పుడు ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని తెలిపారు. ప్రజలు అప్పటి టీడీపీ ప్రభుత్వానికి ప్రస్తుత జగనన్న పాలనకు తేడాను గమనించాలని కోరారు. భీమునిచెరువు, బ్రాహ్మణతాంగాళ్, డీకే పాళ్యం పంచాయతీల్లోని 320 మందికి రెవెన్యూ అధికారులు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. 46 మందికి ఆధార్‌– ఫోన్ నంబర్‌ను అనుసంధానం చేశారు. జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, సుదర్శనరెడ్డి, మండల కన్వీనర్ సొరకాయలు, వైస్ ఎంపీపీ శివశంకర్, జేసీఎస్ కన్వీనర్ కోనేటి బాబు, నాయకులు ఊరప్ప, ఏకాంబరం, సర్పంచ్‌లు మురుగేశం, స్వర్ణ, గుణశేఖర్, తహసీల్దార్ ప్రమీల, ఎంపీడీఓ గుణశేఖర్ పాల్గొన్నారు.

**'జగనన్న సురక్ష' సమస్యల పరిష్కారానికి వేదిక**

సత్యవేడు: జగనన్న సురక్ష పథకం సమస్యల పరిష్కారానికి వేదికగా మారాయని ఎంపీపీ ప్రతిమ, జెడ్పీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి అన్నారు. మండలంలోని ఏఎంపురం, చెరివి సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఏఎంపురంలో 236 మంది, చెరివిలో 298 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ షేక్ జరీనా, డిప్యూటీ తహసీల్దార్ రవిచంద్ర, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుశీల్‌కుమార్‌రెడ్డి, మాస్టర్ స్కూల్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు బొప్పన సోమశేఖర్, సురుటుపల్లి ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, సర్పంచ్‌లు శిరీషా, సుజాత, రత్నమ్మ, శ్రీనివాసులు రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న అధికారులు



హాజరైన ప్రజలు

**జగనన్న సురక్షతో ప్రజలకు మేలు**

కేవీబీపురం: జగనన్న సురక్ష కార్యక్రమం అర్హత ఉండి పథకాలు రాని ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మండలంలోని కోటమంగాపురం, అంజూరుపాళెం, అంజూర సచివాలయ పరిధిలోని గ్రామాల్లో ఆయన పర్యటించారు. అంజూరులో 197, కోటమంగాపురం సచివాలయంలో 116 మందికి వివిధ సర్టిఫికెట్లు అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు గవర్ల కృష్ణయ్య, ఎంపీపీ మునిలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు మునెమ్మ పాల్గొన్నారు.

## ముక్కంటి సేవలో ఉడిపి పీఠాధిపతి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరున్ని శనివారం ఉడిపి పీఠాధిపతి వేదవర్ధన తీర్థ స్వామిజీ దర్శించుకున్నారు. స్వామీజీకి ఆలయ దక్షిణగోపురం వద్ద పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద స్వామి వారి శేషవస్త్రంతో స్వామీజీని సన్మానించి, స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.



ఆలయ ధ్వజస్తంభం వద్ద ఉడిపి పీఠాధిపతి

## వైభవంగా గ్రామోత్సవం

పిచ్చాటూరు: మండలంలోని కీళపూడిలో జరుగుతున్న ముత్యాలయ్య కొలుపులో భాగంగా శనివారం సాయంత్రం ముత్యాలమ్మ గ్రామోత్సవం వైభవంగా జరిగింది. అంతకు ముందు గ్రామంలోని మహిళలు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. మంగళవాయిద్యాలు, బాణాసంచా నడుమ ఊరేగింపు వేడుకగా సాగింది. ప్రజలు కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులతో స్వామి, అమ్మవార్లకు స్వాగతం పలికారు. కంకణం ధరించిన భక్తులు ఊరేగింపులో స్వామి, అమ్మవార్ల సేవలో తరించారు. ఆదివారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో అగ్నిగుండ మహోత్సవం జరుగుతుందని ఆలయ ధర్మకర్తలు పద్మనాభం, ఏఎంసీ చైర్మన్ సునంద తెలిపారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

సత్యవేడు: వినియోగదారుల విద్యుత్ సమస్యల పరిష్కారానికి సబ్ స్టేషన్ కమిటీలు చొరవ చూపుతాయని ఎంపీపీ వి.ప్రతిమ అన్నారు. శనివారం ఇరుగుళం సబ్‌స్టేషన్ ప్రాంగణంలో విద్యుత్ ఏడీ చంద్ర నాయక్ ఆధ్వర్యంలో సబ్‌స్టేషన్ కమిటీ సమావేశం జరిగింది. విద్యుత్ వినియోగదారులు సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం విద్యుత్ వినియోగదారుల కమిటీలు ఏర్పాటు చేస్తుందన్నారు. ఏడీ మాట్లాడుతూ రైతుల విద్యుత్ మోటార్లకు మీటర్లు అమర్చుతున్నామన్నారు. 5హెచ్‌పీ మోటారుకు నెలకు రూ. 6వేలు చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వం నెలకు ముందే రైతుల ఖాతాలోకి జమ చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఈ వెంకటస్వామి, వ్యవసాయ అధికారి మురళి, సబ్‌స్టేషన్ కమిటీ సభ్యులు మునికృష్ణయ్య, ఎబినేజర్, చంద్రశేఖర్‌రెడ్డి, రైతులు శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

### గోడౌన్ల పరిశీలన

రేణిగుంట: 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కొత్తగా తయారు చేసిన బెల్‌ఎం3 ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, ఈవీ ప్యాట్‌లు భద్రపరచడం కోసం గుర్తించిన రేణిగుంట విమానాశ్రయానికి సమీపంలోని గోదాములను శనివారం కలెక్టర్ వెంకటరమణారెడ్డి పరిశీలించారు. భద్రతా ప్రమాణాల మేరకు గోదాముల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ డీకే బాలాజీ, డీఆర్వో కోదండరామిరెడ్డి, తిరుపతి, శ్రీకాళహస్తి ఆర్డీలు నరసారెడ్డి, రామారావు, ఆర్‌అండ్‌బీ జిల్లా అధికారి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గోదాములను పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

## విద్యార్థులకు వరం.. అమ్మఒడి



బీఎన్‌కండ్రిగలో అమ్మ ఒడి మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

బుచ్చినాయుడుకండ్రిగ: రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న అమ్మ ఒడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. శనివారం బీఎస్ కండ్రిగ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లులకు జగనన్న అమ్మ ఒడి మెగా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో చంద్రబాబు విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టారని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యమిస్తూ, విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తున్నారని తెలిపారు. మండలంలోని 3200 మందికి రూ.4.80 కోట్లను విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులను సీఎం జగన్ తన పాదయాత్రలో గమనించి, అమ్మ ఒడి పేరుతో ఏటా విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ. 15 వేలు చొప్పున జమ చేస్తున్నారని పేర్కొన్నారు. నాడు–నేడు పేరుతో పాఠశాలల ఆధునీకరణకు వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. పాఠశాల తెరిచిన రోజే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందజేశారన్నారు. జగనన్న గోరుముద్ద ద్వారా విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ప్రతిమ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆరణివి ద్యానాథరెడ్డి, నాయకులు అజయ్‌కుమార్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మణినాయుడు, ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం, తహసీల్దార్ హనుమాన్‌నాయక్, ఎంపీడీఓ నరసింహరావు, ఎస్‌ఐ మంజునాథరెడ్డి, సర్పంచ్ వెంకటమ్మ పాల్గొన్నారు.

**అర్హులందరికీ పథకాలు**

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించి, సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. జూలై 1 నుంచి 22 వరకు సచివాలయాల వద్ద ప్రత్యేక క్యాంపుల ద్వారా ప్రజల నుంచి అన్ని రకాల వినతులకు ప్రభుత్వం పరిష్కారం చూపిస్తుందన్నారు.

**ఏఎంపురం సచివాలయం తనిఖీ**

సత్యవేడు: మండలంలోని ఏఎంపురం సచివాలయంలో నిర్వహిస్తున్న ×జగనన్న సురక్ష౯ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలు, పరిష్కరించిన సమస్యలపై ఆరా తీశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఇంటింటా సంతోషాన్ని నింపుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు.

### వైద్య శిబిరానికి స్పందన

వరదయ్యపాళెం: నేషనల్ డాక్టర్స్ డేను పురస్కరించుకుని డైనమిక్ ఫౌండేషన్ సహకారంతో వరదయ్యపాళెంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. లోకేశ్వరి క్లినిక్‌లో గ్రామస్తులకు వివిధ పరీక్షలు చేసి మందులు అందజేశారు. వరదయ్యపాళెం, గోవర్ధనపురం, ఇందిరానగర్, కాంబాకం పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో డైనమిక్ ఫౌండేషన్ ప్రతినిధులు నాగప్రసాద్, బాలకృష్ణ, రామసుబ్బయ్య, మాడస్వామి, మహమ్మద్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ వలంటీర్ మృతి

ఏర్పేడు: మండలంలోని దుర్గిపేరికి చెందిన వలంటీర్ రవికుమార్(25) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎంపీడీఓ గిడ్డయ్య చెప్పారు. శుక్రవారం ద్విచక్ర వాహనంలో నెల్లూరు ఐటీఐలో హాల్‌టికెట్ తీసుకుని వచ్చేందుకు వెళ్తూ వెంకటాచలం వద్ద రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడినట్లు చెప్పారు. నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు పేర్కొన్నారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అందజేసినట్లు వెల్లడించారు.

### వాక్యపు వెలుగు మినిస్ట్రీ వ్యవస్థాపకుడు బెన్హర్ మృతి



బెన్హర్(ఫైల్)

రేణిగుంట: రేణిగుంట పుర ప్రముఖులు, వాక్యపు వెలుగు మినిస్ట్రీ వ్యవస్థపాకులు, హెరాల్డ్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ కరెస్పాండెంట్ ఎస్.బెన్హర్ శనివారం మృతి చెందారు. ఆయన అంతిమ కార్యక్రమాలు ఆదివారం మధ్యాహ్నం రేణిగుంట పాత చెక్‌పోస్ట్ సమీపంలోని సెయింట్ లూథరిన్ చర్చిలో జరగనున్నాయి. ఆయన పార్థివ దేహం వద్ద మత పెద్దలు, పలువురు పాస్టర్లు వచ్చి నివాళులు అర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన మృతి బాధాకరమని సర్పంచ్ నగేశం, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ అన్నారు.

### సమస్యల పరిష్కారానికే గ్రామసభ

రేణిగుంట: పట్టణంలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి గ్రామసభను ప్రజలు వినియోగించుకోవాలని రేణిగుంట సర్పంచ్ నగేశం అన్నారు. రేణిగుంట పంచాయతీ కార్యాలయంలో శనివారం సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ జరిగింది. ఈవోపీఆర్‌డీ వెంకటరత్నమ్మ పాల్గొని వివిధ అంశాలను చర్చించారు. ఆయా అంశాలకు సంబంధించి గ్రామసభ సభ్యులు లేవనెత్తిన సమస్యలను చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామని సర్పంచ్ తెలిపారు.

### ఎల్లమ్మ ఆలయంలో పూజలు

ఏర్పేడు: మండలంలోని ఎండీపుత్తూరు ఎల్లమ్మ ఆలయంలో బియ్యపు పవిత్రారెడ్డి శనివారం పూజలు చేశారు. వార్షికోత్సవం సందర్భంగా గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఆమె ఆలయానికి వెళ్లి అర్చనలు, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మోహనప్రియ, నాయకులు మహేష్, గోవర్ధన్‌రెడ్డి, బాలాజీరెడ్డి, రామాచారి, గౌరి, సుబ్రమణ్యం యాదవ్, హమీద్ బాషా పాల్గొన్నారు.

### ఎస్‌బీఐలో వ్యవస్థాపక దినోత్సవం



సంబరాలు చేసుకుంటున్న రేణిగుంట ఎస్‌బీఐ సిబ్బంది

రేణిగుంట: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రేణిగుంట బ్రాంచిలో శనివారం వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 1965 జూలై 1వ తేదీన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకు స్థాపన జరిగిందని బ్యాంకు మేనేజర్ గోపినాయక్ తెలిపారు. కేక్ కట్ చేశారు. ఖాతాదారులకు ఉత్తమమైన సేవలను అందిస్తున్నామన్నారు. మారుతున్న కాలానుగుణంగా ఆన్‌లైన్ డిజిటలైజేషన్ ట్రాన్స్‌ఫర్స్ సేవలను కూడా అందిస్తున్నట్లు బ్యాంకు మేనేజర్ తెలిపారు. రేణిగుంటకు చెందిన డాక్టర్ జనార్ధన్, వ్యాపారవేత్త సీఆర్ రాజన్, సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తి ప్రపత్తులతో మహాప్రదోష పూజలు

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటపల్లి శ్రీపల్లికొండేశ్వరాలయంలో శనిత్రయోదశిని పురస్కరించుకుని శనివారం మహా ప్రదోష పూజలు నిర్వహించారు. ఆలయంలోని నందీశ్వరునికి పాలు, పెరుగు, కొబ్బరినీరు, చందనం, వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. పుష్పాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శభాగ్యం కల్పించారు. అంతకు ముందు ఆలయంలో కొలువుదీరిన దేవతామూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. చివరగా శివపార్వతుల ఉత్సవమూర్తులను ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, ఈఓ రామచంద్రా రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**సోమనాథేశ్వరాలయంలో..**

పిచ్చాటూరు మండలం సిద్ధిరాజుకండ్రిగలోని శ్రీగౌరీ సమేత సోమనాథేశ్వర ఆలయంలో మహా ప్రదోష పూజలు జరిగాయి. నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకించి, పలు రకాల పుష్పాలతో విశేష అలంకరణ చేశారు. శివపార్వతుల ఉత్సవమూర్తుల ప్రాకారోత్సవం నిర్వహించారు. ఏర్పాట్లను ధర్మకర్త జ్యోతిరాజు పర్యవేక్షించారు.



సురుటపల్లిలో నందీశ్వరునికి హారతి ఇస్తున్న అర్చకుడు

## ఘనంగా శ్రీకృష్ణాశ్రమ వార్షికోత్సవం

ఏర్పేడు: మండలంలోని బండారుపల్లి శ్రీకృష్ణాశ్రమంలో శనివారం ఘనంగా 44వ వార్షికోత్సవం జరిగింది. స్వామివారి చిత్రపటానికి వివిధ రకాల అభిషేకాలతో విశేష అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆశ్రమాల పీఠాధిపతులు ఉపన్యాసాలు చేశారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. మరో రెండురోజులపాటు ఉత్సవాలు జరగనున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ జీవిత, వైస్ ఎంపీపీ తిరుపతి జనార్దన్‌రెడ్డి, పుత్తూరు జగన్మాత ఆశ్రమ పీఠాధిపతి శివానందగిరి స్వామి, హైదరాబాదుకు చెందిన రామకృష్ణ ఆనందగిరి స్వామి, ఆశ్రమ నిర్వాహకుడు రంగాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న రామకృష్ణ ఆనందగిరి

### ఉత్తర గోగ్రహణం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధాలయమైన శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజ స్వామి ఆలయంలో శనివారం ఉత్తర గోగ్రహణ ఘట్టాన్ని వేషదారులు కన్నులపండువగా నిర్వహించారు. ఉదయం ద్రౌపదీదేవి పురవిహారం చేయగా.. రాత్రి గోవులను మలవేసే కార్యక్రమంలో భాగంగా అర్జునుడు అశ్వవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు.



పురవీధుల్లో ఊరేగుతున్న అర్జునుడు

**నేడు అగ్నిగుండ మహోత్సవం**

ధర్మరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అగ్నిగుండ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లును పాలక మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, సభ్యులు, అధికారులు పర్యవేక్షించారు. సాయంత్రం 6 గంటలకు అగ్నిగుండ ప్రవేశం ప్రారంభం కానుంది.

## సమష్టి కృషితో ఆదాయ వృద్ధి

నారాయణవనం: గ్రామ పంచాయతీ ఆదాయాన్ని సమష్టి సహకారంతో వృద్ధి చేసుకోవాలని పలువురు సూచించారు. శనివారం నారాయణవనం మేజర్ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ శారదాగణేషన్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈఓ షణ్ముగం మాట్లాడుతూ.. పంచాయతీకి పన్నులు, అద్దె రూపంలో మాత్రమే ఆదాయం లభిస్తోందన్నారు. పన్నులను సకాలంలో చెల్లించాలని కోరారు. మండల ప్రత్యేక ఆహ్వానితులు సుదర్శన రెడ్డి మాట్లాడుతూ.. జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఉపాధి పనులు కల్పించాలన్నారు. మూడేళ్ల వివిధ పథకాల ద్వారా లబ్ధిదారులకు అందిన ప్రభుత్వ ఫలాలను, ఆదాయ వ్యయాలను వివరించారు. కొత్తగా వైఎస్సార్ పెన్షన్ కానుక మంజూరైన వారికి నగదు పంపిణీ చేశారు. ఎంపీపీ దివాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ శివశంకర్, చిన్నదొరై పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ షణ్ముగం